సస్యరక్షణతో ఫలదాయకం

- ఉద్యాన తోటల్లో అధిక దిగుబడికి సస్యరక్షణే కీలకం
- సబ్‌డివిజన్‌లో 19 వేల ఎకరాల్లో సాగు

తుని రూరల్: ఉద్యాన తోటలలో అధిక దిగుబడి సాధించేందుకు సస్యరక్షణ, భూ సంరక్షణ చర్యలే కీలకపాత్ర వహిస్తాయి. ఫలసాయం అందే ముందు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో తాత్కాలిక ప్రయోజనాలే తప్ప నాణ్యమైన అధిక దిగుబడి సాధించలేరని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు. పంట కాలం ముగిసిన వెంటనే సస్యరక్షణ, భూ సంరక్షణ చర్యలతో తోటలు ఆరోగ్యవంతంగా ఉండి నాణ్యమైన అధిక దిగుబడిని ఇస్తాయన్నారు. భూ సంరక్షణకు ప్రతి సంవత్సరం రెండుసార్లు దుక్కులు చేసుకోవడంతో పాటు మట్టి నమూనాల పరీక్షతో భూసారాన్ని పెంపొందించాలి. ఫలసాయం పొందిన తర్వాత పండ్ల తోటలను వదిలేయకుండా ఎండి కొమ్మలను, గుబురుగా ఉన్న అదనపు కొమ్మలను తొలగించడం వల్ల చెట్లు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. ఇందుకు రైతులు సస్యరక్షణ, భూ సంరక్షణపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. ఉద్యానశాఖ సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో 19వేలు ఎకరాల్లో కొబ్బరి, కోకో, ఆయిల్ పామ్, నిమ్మ, బత్తాయి, మామిడి, జీడిమామిడి తోటలు సాగవుతున్నాయి.


దొండవాకలో నీటి నిల్వ కోసం పామాయిల్ చెట్ల చుట్టూ ఏర్పాటు చేసిన పళ్లాలు


రాజులకొత్తూరులో కోకోలో కొమ్మలు కత్తిరిస్తున్న కూలీలు

రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు

కొబ్బరితోటలలో ఆరు నెలలకు ఒకసారి దుక్కు చేయాలి. ఐదేళ్లలోపు వయస్సుని తోటలలో చెట్ల ప్రధాన వేర్లకు నీరు, ఎరువులు నేరుగా అందేలా మూడు అడుగుల చుట్టు కొలతల పళ్లాలు తయారు చేయాలి. పదేళ్లలోపు వయసు గల ఆయిల్‌పామ్ తోటల్లోను చెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటు చేయాలి. ఆయిల్‌పామ్ కొమ్మలు కత్తిరించి తోటల్లో గుట్టలుగా వేస్తే ఎండిన తర్వాత ఎరువుగా చెట్లకు అందుతుంది. కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలకు సాగునీరు అందించడానికి అనువుగా డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. మామిడి పంటకాలం ముగిసిన తర్వాత జూలై నుంచి సెప్టెంబరు మధ్యలో చెట్లపై ఉండే ఎండి పుల్లలు, విస్తారంగా ఉండే కొమ్మలను తొలగించాలి. అవసరమైతే ఎండి పుల్లలను దగ్ధం చేయాలి. దీనివల్ల పంటకాలంలో వివిధ రకాల పురుగుల ఉధృతి అదుపులో ఉంటుంది. కోకోలో జూలై, ఆగస్టులలో గొడుగు ఆకారంలో కొమ్మలు కత్తిరించాలి. ఇలా చేయడం వల్ల చెట్ల కొమ్మలకు, కాండానికి గాలి, వెలుతురు సోకి ఆరోగ్యవంతంగా ఉంటాయి. కాండం బలంగా ఉండడంతో అందుకు అనువుగా పూత, పిందెలు వచ్చి అధిక దిగుబడులు లభిస్తాయి.

> **రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలు**
> ఆయిల్‌పామ్ విస్తరణలో భాగంగా రూ.29వేలు విలువ చేసే మొక్కలను పూర్తిగా రాయితీపై అందిస్తున్నాం. కోకోలో కొమ్మలు కత్తిరింపునకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపడితే తెగుళ్లు, పురుగులు ఉధృతి తగ్గుతుంది. పెట్టుబడి ఆదా అవుతుంది. పంటకాలంలో నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయి. కోకో కొమ్మల కత్తిరింపు, ఆయిల్‌పామ్ మొక్కల రాయితీలకు రైతు భరోసా కేంద్రాల ఉద్యాన, వ్యవసాయ, సెరీకల్చర్ అసిస్టెంట్లను రైతులు సంప్రదించాలి.
> – జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

బాలికల వసతిగృహం సందర్శన


వసతిగృహంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ (ఎంఎల్ఎస్‌పీ) సభ్యులు బుధవారం ఉదయం సందర్శించారు. ఎంఎల్ఎస్‌సీ పానెల్ అడ్వకేట్లు బుగత శివ, బొంగులూరి మధుబాబు, అవసరాల దేవి వసతిగృహంలోని సదుపాయాలను, విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రభుత్వం అందించే అన్ని రకాల సదుపాయాలు విద్యార్థులకు అందుతున్నాయా, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అనే అంశాలపై విద్యార్థినులను ఆరా తీశారు. వసతిగృహ నిర్వాహణపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులో పానెల్ అడ్వకేట్ బుగత శివ మాట్లాడారు. కార్యక్రమంలో మండల లీగల్ సెల్ అథారిటీ బాధ్యురాలు శ్రీలక్ష్మి, వసతిగృహ సంక్షేమాధికారి జె.సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తుని: స్థానిక మహిళా జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్టు లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.తారకేశ్వరి బుధవారం తెలిపారు. కంప్యూటర్ సబ్జెక్టు బోధించేందుకు బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్)లో 50 శాతం మార్కులు సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు కాలేజీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

కోటనందూరు: నిరుద్యోగ యువతీ, యువకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం సూర్యకుమారి బుధవారం తెలిపారు. ఇంజినీరింగ్ చదువుకున్న నిరుద్యోగ యువతకు కాకినాడ జేఎన్‌టీయూలో శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇప్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆటోమోటివ్, ఆటోమేషన్, రోబోటిక్స్ ఉద్యోగానికి సంబంధించి బీఈ, బీటెక్(ఆటోమోటివ్ మెకానికల్/ఎలక్ట్రానిక్స్), డిప్లమా(మెకానికల్/ఆటోమొబైల్) పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వీరికి 4 నెలలు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం కల్పిస్తారన్నారు. సర్టిఫైడ్ ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి బీఈ, బీటెక్ (ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్) చదివిన వారు అర్హులన్నారు. వీరికి 5 నెలలు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఈ రెండు కోర్సులకు సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9550724690 నంబరును సంప్రదించాలన్నారు.

అమర వీరులకు నివాళి

ప్రత్తిపాడు: కార్గిల్ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో బుధవారం అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమర వీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్య సాగుబడిపై అవగాహన

ఏలేశ్వరం: మత్స్యశాఖ ఆధ్వర్యంలో మర్రివీడు గ్రామంలో బుధవారం మత్స్యసాగుబడిపై అవగాహన కల్పించారు. గ్రామ మత్స్యశాఖ అధికారి వి.శ్రీనుబాబు మత్స్యకారులకు పలు అంశాలపై వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పలుప థకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఏలేరు ప్రాజెక్టులో పడవలు, వలలు, రిజర్వాయర్ లైసెన్సు, నిబంధనలపై వివరించారు.

ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రమాదకరం

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గుతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య తెలిపారు. మండలంలోని వేళంగి గ్రామంలో బుధవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారిని పునర్నిర్మించాలి

ఏలేశ్వరం: ఏజెన్సీ ముఖద్వారమైన ప్రధాన రహదారిని పునర్నిర్మించాలని రమణయ్యపేటలో బుధవారం ధర్నా చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో రహదారిపై గోతుల్లో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి రహదారిని పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమాల కుశల, అర్జునుడు, గంగాధర్ పాల్గొన్నారు.

డీపీ భక్షి వర్ధంతి

ప్రత్తిపాడు: ఎన్నో విప్లవ ఉద్యమాల్లో పాల్గొన్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు డీపీ భక్షి ఎందరో ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రావు కొనియాడారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం వద్ద బుధవారం డీపీ భక్షి వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుగత బంగార్రావు డీపీ భక్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకలు మానుకొండ లచ్చబాబు, తాడి నాగేశ్వరరావు, మంగ, లక్ష్మణరావు, అప్పారావు, చెల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గండేపల్లి: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మురారి గ్రామానికి చెందిన బాలిక స్థానిక హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన భువనగిరి కిరణ్‌కుమార్(శాంతి కుమార్) గత కొంత కాలంగా ప్రేమిస్తున్నానని ఆమె వెంటపడుతున్నాడు. ఈ నెల 23న ఆమెకు మాయమాటలు చెప్పి, బ్లాక్ మెయిల్ చేసి తీసుకువెళ్లిపోయినట్టు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


జెఅన్నవరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్


వీరవరంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- జె.అన్నవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఏలేశ్వరం: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. జె.అన్నవరం గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంజగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, పసల నాగేశ్వరరావు, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. బుధవారం వీరవరంలోని ఎంపీపీ తోట రవి, తోట గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని 735 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, తోట అంబి, తోట విష్ణుమూర్తి, తోట వేణు, ఉపసర్పంచ్ తోట నారాయణరావు, జనపరెడ్డి బాబు భారీ స్థాయిలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గుర్రంపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం

జగ్గంపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలియజేశారు. గుర్రంపాలెంలో బుధవారం జరిగిన జనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో ప్రభుత్వ పథకాలు అందని అర్హులకు ఈ కార్యక్రమం ద్వారా పరిశీలించి దరఖాస్తు చేసిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా వక్ఫ్‌బోర్డు డైరక్టర్, జాయింట్ సెక్రటరీ షేక్ సయ్యద్, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఎంపీపీ తోట రవి, గ్రామ సర్పంచ్ చీపురపల్లి లక్ష్మి, అధికారులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చామవరంలో జగనన్న సురక్ష ..

తుని రూరల్: చామవరంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు ఎంపీడీఓ పి.రవికుమార్‌తో దరఖాస్తుదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. కార్యదర్శి సత్యనారాయణ, పంచాయతీ బోర్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మేలు : ఎమ్మెల్యే

ఏలేశ్వరం: జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. జె.అన్నవరం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందేతున్నాయన్నారు. ప్రజలందరూ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నారావు, ఎంపీటీసీ సభ్యురాలు కాలారి శిరీష, నీరుకొండ సత్యనారాయణ, కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, అడపా పార్థసారథి, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.


జెఅన్నవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్


చామవరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దొరబాబు అధికారులు

గ్రామాల్లో జగనన్న సురక్ష

తొండంగి: వేమవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మేరుగు పద్మలత పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తొండంగిలో కూడా జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఏవో ఎస్.నరసింహం, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు గాబు రాజు, తుని నియోజక వర్గ మత్స్యకార విభాగం కన్వీనర్ మేరుగు ఆనందహరి, సర్పంచ్‌లు సోమాల ప్రసాద్, వేమవరం మారేటి కృష్ణ, అద్దరిపేట సర్పంచ్ కోడా వర్మ, ఎంపీటీసీ కఠారి లక్ష్మణ్, శివకోటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


గుర్రంపాలెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మల

విస్తారంగా వర్షాలు


కత్రాళ్లకొండవద్ద మినీ రిజర్వాయర్‌పై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు


పెద్దిపాలెంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నేలకూలిన తాటాకిల్లు

తుని రూరల్: మండలంలో విస్తారంగా భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఎగువ, పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షపునీటితో తాండవ నది పొంగి ప్రవహిస్తోంది. తునికి ఎగువన, దిగువన ఉన్న రెండు మినీ రిజర్వాయర్లపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. తునికి ఎగువన ఉన్న మినీ రిజర్వాయర్ సాగునీటి కాలువ నుంచి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో పంట భూములకు చేరుతోంది. దిగువన ఉన్న మినీరిజర్వాయర్ ఎడమ, కుడి కాలువల నుంచి పాయకరావుపేట, తుని మండలం కవలపాడు గ్రామాల పరిధిలో భూములకు చేరుతోంది. అదనపు జలాలు కట్టడాలపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తూ వరదనీరు సముద్రంలో కలుస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్టలో ఖరీఫ్ పనులకు ఊతమిచ్చిందని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. తాండవ, పంపా రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరుగుతున్నాయన్నారు.

ప్రత్తిపాడులో ...

ప్రత్తిపాడు రూరల్: మండలం వ్యాప్తంగా బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. మండలంలో 44.4 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దిపాలెం ఎస్సీ కాలనీలో గాలింకి సత్తిబాబు తాటాకిల్లు నేలకూలింది. సత్తిబాబు అతని భార్య లోవమ్మ, ముగ్గురు కుమార్తెలతో ఇంట్లో ఉండగానే ఇల్లు కూలిపోయింది. ఇల్లు నేలమట్టం కావడంతో ఆ కుటుంబం నిలువ నీడలేక నిరాశ్రులయ్యారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు: ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యువకుని కుటుంబానికి పారిశ్రామిక వేత్త గణేశుల రాంబాబు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. చినశంకర్లపూడి గ్రామానికి చెందిన ఏనుగు నాగబాబు(25) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం సాయంత్రం మృతుని కుటుంబ సభ్యులకు గణేశుల మురళి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు చనిబోయిన బుజ్జి, గోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై ఇంటింటా సర్వే

శంఖవరం: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశమై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదుపై సర్వే చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో లేని ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు, చనిపోయిన వారి వివరాలు నమోదు చేయాలన్నారు.

విద్యుదాఘాతానికి ఆబోతు మృతి


విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఆబోతు

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై బుధవారం ఆంబోతు మృతి చెందింది. వివరాల ప్రకారం.. గ్రామంలో ఆబోతు ఉదయం బయట సంచరిస్తుండగా విద్యుత్ స్తంభానికి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గత రెండు రోజులుగా గ్రామంలో వర్షం కురుస్తుండడంతో విద్యుత్ స్తంభానికి విద్యుత్ సరఫరా అయి ఆబోతుకు షాకు తగిలి మృతి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సంఘటనతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

ప్రత్తిపాడు: వచ్చేనెల రెండో తేదీ నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించనున్న ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమంపై కార్యాచరణ రూపొందించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కుమార్‌బాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న ఆటల పోటీలపై ఆసక్తి కలిగిన 17 ఏళ్లు దాటిన యువతీ యువకులను గుర్తించాలన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్‌లలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి పోటీలు నిర్వహించాలన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందిన వారికి ఈ పోటీల్లో అనుమతిలేని, అంతేగాక యువతీ యువకులతో పాటు ఉద్యోగస్తులు కూడా పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమం నిర్వాహణకు ఎంపీడీఓ, తహసీల్దార్, పీడీలు, మండల ఇంజినీరింగ్ అధికారితో కమిటీ ఏర్పాటు చేశామని ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావులతో పాటు సచివాలయ కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలి


శిక్షణలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: విద్యార్థులకు అర్థమయ్యేలా, మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని జోడించి, విద్యాబోధన చేయాలని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి స్కూల్ కాంప్లెక్స్‌లలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ డైరీలు, పాఠ్య ప్రణాళికలు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలో నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలని, విద్యార్థుల తప్పులను గుర్తించి సరిచేయాలన్నారు. బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా బడిలోనే ఉండేలా చూడాలని, జగనన్న విద్యా కానుక కిట్లు అందరికీ అందించాలని సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. ఈశిక్షణా తరగతులకు ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీఎంఓ వెంట మండల విద్యాశాఖాధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, సీఎంఆర్టీ ఇ.రాంజీప్రసాద్ ఉన్నారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

గండేపల్లి: రెండు రోజులుగా జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారంతో ముగిసినట్టు ఎంఈఓ కెహెచ్ నాయక్ తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో జరగబోయే ఫార్మేటివ్-1 అసెస్మెంట్‌కు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చామని, ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో అమలు చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులకు తెలియజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలి

జగ్గంపేట: మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో స్థానిక స్టాలిన్ భవనంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎం.ఏసు, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

తొండంగి: దానవాయిపేట జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. ఒంటిమామిడికి చెందిన దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల విలువైన స్టీల్ వాటర్ బాటిళ్లను 720 మంది విద్యార్థులకు స్కూల్‌కమిటీ చైర్మన్ చొక్కా వరలక్ష్మి అందజేశారు. ఈసందర్భంగా దివీస్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అధికారి ఈఎస్ నాగరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు విద్యార్థులకు స్టీల్ బాటిళ్లను కంపెనీ యాజమాన్యం సహకారంతో అందజేశామన్నారు. కంపెనీ సహకారంతో రక్షిత మంచినీటిని అందించేందుకు తీరప్రాంత గ్రామాల్లో ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు బి.వాసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మడదా హేమంత్, హెచ్ఎం ప్రసాదరావు, తుని నియోజక వర్గ మత్స్యకార విభాగం కన్వీనర్ మేరుగు ఆనందహరి పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టీల్ బాటిళ్లు అందజేసిన దృశ్యం

నేడు పీఎం కిసాన్ నగదు జమ

గోకవరం: మండలంలో సొంత పొలం ఉన్న రైతులకు గురువారం పీఎం కిసాన్ 14వ విడత సొమ్ము రూ.2 వేలు జమవుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో ప్రధానమంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడే ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం అవుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులంతా ఈ కార్యక్రమాన్ని వీక్షించాలన్నారు.